# కర్నూలు I నంద్యాల వార్త

15 డిసెంబర్, 2023 శుక్రవారం పేజీలు 4


## అంగన్వాడీ సెంటర్లు మూతపడకూడదు..

**- సేవలు యధాతథంగా జరగాలి : ఇంచార్జి జిల్లా కలెక్టర్**



**నంద్యాల, డిసెంబరు 14, ప్రభాతవార్త:** అంగన్వాడీల నిరవధిక సమ్మె సందర్భంగా చంటి పిల్లలు, గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్వాడీ కార్యకర్తల ప్రత్యామ్నాయ సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు మరియు ఆయాలు నిరవధిక సమ్మెలో పాల్గొని ధర్నా చేస్తున్న సందర్భంగా అంగన్వాడీ సెంటర్లు మూతపడకుండా, చంటిపిల్లలు, గర్భిణీలకు అంగన్వాడీ కార్యకర్తల సేవలు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఎంపీడీఓలు, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ఏపీఎంలు, డిప్యూటీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందికి సంబంధిత అంగన్వాడీ సెంటర్లను అనుసంధానం చేసి అంగన్వాడీ సెంటర్ల మనుగడకు ఎలాంటి అంతరాయం కలుగకుండా అంగన్వాడీ సేవలు యధాతథంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మెయిన్ అంగన్వాడీ 1620, మినీ అంగన్వాడీ సెంటర్లు 43 మొత్తం కలిపి 1663 సెంటర్లు పనిచేస్తున్నాయని ఈ సెంటర్ల ద్వారా చంటిపిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారం, పాలు, గుడ్లు, బాలామృతం, గర్భవతులకు మరియు బాలింతలకు పంపిణీ చేసే బియ్యం, బ్యాల్లు, నూనె, వైఎస్సార్ కిట్లు, పాలు మరియు గుడ్లు మొదలగు వాటిని లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అందుకు పక్కాగా ప్రణాళిక తయారు చేసుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ సెంటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గతంలో లాగానే నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్‌తోపాటు పీడీ లీలావతి పాల్గొన్నారు.

## వైయస్ఆర్‌సీపీ సర్పంచ్ అనుచరులతో టిడిపిలో చేరిక

**ఆళ్లగడ్డ, డిసెంబరు 14, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామంలో పుల్లారెడ్డి కూతురు వైసీపీ సర్పంచ్ మౌనిక తన అనుచర వర్గం సుమారు 75 కుటుంబాలు, నలుగురు వార్డు మెంబర్లు మాజీ మంత్రి భూమా అఖీల ప్రియ అధ్వర్యంలో టిడపిలో చేరారు. గురువారం మాజీ మంత్రి భూమా అఖీల ప్రియ, యువ నాయకులు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి టిడిపి నాయకులు భార్గవ్‌రాంనాయుడులను గుండం పాడు నాయకులు ఘనస్వాగతం పలికి సర్పంచ్ నివాసం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మౌనిక తను అనుచరులతో పార్టీలో చేరారు. వారికి భూమా అఖీల ప్రియ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా భూమా అఖీల ప్రియ, జగత్ విఖ్యాత్‌రెడ్డిలు మాట్లాడుతూ టిడిపి విధానాలు నచ్చి పార్టీలో చేరడం హర్షణీయం అన్నారు. అనంతరం సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ వైసీపీ విధి విధానాలతో చాల విసిగిపోయామని అందుకే పార్టీని వీడి టిడిపిలో చేరామని టిడిపి బలోపేతానికి కృషిచేస్తు భూమా కుటుంబానికి సహకరిస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర శిక్షా అభియన్ ఉద్యోగులకు.. జీతాల 'శిక్ష'..!

- **కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు..**
- **దీర్ఘకాలంగా పనిచేస్తున్న పట్టభద్రులు.. మూడు నెలలుగా రాని జీతాలు..**
- **ఉద్యోగ భద్రతపై నేటి నుంచి దశల వారిగా ఆందోళన..**

**విద్యాశాఖలో ఒక భాగమైన ఏపి సమగ్ర శిక్షా అబియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు రాకపోవడంతో వారు నిజజీవితంలో శిక్షను అనుభవిస్తున్నారని విద్యానిపుణులు వెల్లడిస్తున్నారు.. గత మూడు నెలలుగా వీరికి జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ర్రాష్టంలో సుమారు 25 వేల మంది కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందని జిల్లా స్థాయి కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ జెపిసి నాయకులు తెలుపుతున్నారు.. ఉన్నత చదువులు చదివి పట్టభద్రులుగా ఉన్నటువంటి నిరుద్యోగులు సర్వ శిక్ష అభియాన్‌లో ఉద్యోగులుగా చేరి వెట్టి చాకిరి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి..**



**కోసిగి, డిసెంబరు 14, ప్రభాతవార్త** పట్టభద్రులైనప్పటికి ఈ సమగ్ర శిక్షా అభియాన్ లో చేరి కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నట్లు తెలిపారు.. అంతేకాక ఈ ఉద్యోగుల్లో ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఉద్యోగులే ఎక్కువ మంది పనిచేస్తున్నారు.. వీరికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ ఉద్యోగులకు నెల నెల జీతాలు ఇవ్వటం జరుగుతుంది.. అయితే దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వేరే పనులకు మళ్లించి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతాలు వేయకపోవడంతో వారి జీవనం రోడ్డున పడిందని చెప్పవచ్చు.. చాలీ చాలని తక్కువ జీతంతో జీవనం కొనసాగిస్తున్నప్పటికీ కుటుంబ భారం వల్ల వారు పిల్లలకు పాఠశాల ఫీజులు కట్టలేని పరిస్థితి.. అంతేకాక ఏ చిన్న జ్వరం వచ్చినా, మందులు కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడినట్లు తెలుపుతున్నారు.. రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో తమ సమస్యలపై స్పందిస్తూ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎంటిఎస్ మినిమం టైం స్కేల్‌ను వర్తింపచేస్తానని హామి ఇవ్వడం జరిగినట్లు తెలిపారు.. తీర ప్రభుత్వం వచ్చాక దానిఊసే మరచి పోవడమే కాకుండా కనీసం జీతాలు కూడా ఇవ్వని పరిస్థితి దాపురించినట్లు నిరుద్యోగులు వాపోతున్నారు..గత్యంతరం తేని పరిస్థితుల్లో ఏ పని చేయలేక డిగ్రీలు, పీజీలు చేసి కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగంలో గత 13 సంవత్సరాలుగా వెట్టి చాకిరి చేస్తున్నామన్నారు.. వీలైనంత మందిని రెగ్యులర్ చేస్తామని సీఎం హామి నీటిమూట అయింది..సీఎం హామి ఇచ్చి నాలుగున్నర ఏళ్లు గడుస్తున్నా ఎన్నికల కోసమే ఇలా హామి ఇచ్చాడని వారు తెలిపారు.. ఇప్పటికైనా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని మూడు నెలల జీతాలను వెంటను ఇప్పించాలని కోరుతూ ఈ నెల 11వ తేది ఛలో విజయవాడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినప్పటికి ప్రభుత్వం నుండి ఏలాంటి సమాచారం రాలేక పోవడంతో నేటి నుండి దశల వారిగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చేయడం జరుగుతుందని వారు తెలిపారు..

## మరణాలపై వైద్యులు మరియు వైద్యసిబ్బందితో సమీక్ష సమావేశం



**కర్నూలు అర్బన్, డిసెంబరు 14, ప్రభాతవార్తః** మరణాలపై వైద్యులు, వైద్యసిబ్బందితో జిజిహెచ్, కెఎంసి కర్నూలు నెలవారి మరణాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వి వెంకటరంగారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎంసిలో అన్ని డిపార్టుమెంటల్ హెచ్ఓడిలు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు అసిసెంటు ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్‌లు, పిజిలు సమావేశానికి హాజరయి మరణాలపై పలు విషయాలపై చర్చించి వారితో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. మెడికల్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన రెండు కేసులపై ప్రజేంటేషన్ ద్వారా సమీక్ష చేసినట్లు తెలిపారు. మందులు, పరికరాలు కొనడానికి సిద్దంగా ఉన్నామని అన్ని విభాగాల హెచ్‌ఓడిలకు ప్రపొజల్స్ సిద్దం చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటి సూపరింటెండెంట్ డా.ప్రభాకర్‌రెడ్డి, సిఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వర్‌రావు, హెచ్ఓడిలు డా.రామకృష్ణ నాయక్, డా.రేణుకాదేవి, డా.పద్మ విజయ, డా.శ్రీరాములు,డా.నాగేశ్వర్‌రావు, డా.విజయ ఆనంద్ బాబు, డా.శ్రీనివాసులు, డా.ముజుల బాయి, ఆర్ఎంఓ వెంకటరమణ, ఆసుపత్రి అడ్మిని స్ట్రేటర్స్ డా.శివబాల నగాంజన్‌లు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే.. రాష్ట్రాభివృద్ధి సాధ్యం..!



**ప్యాపిలి డిసెంబరు14(ప్రభాతవార్త):** రాష్ట్రాభివృద్ధి టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాయిపల్లె గ్రామంలో గురువారం బాబు ష్యూరిటి.. భవిష్యత్తుకు గ్యారంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రజాస్వామ్య విధానాలను అనుసరిస్తున్న జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపే సమయం అసన్నమైందని తెలిపారు. రానున్న ఎన్నికలలో టిడిపికి ఓటు వేసి గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణాన్ని, దీపం పథకం కింద నెలకు ఉచితంగా మూడు సిలెండర్లను అందిస్తామని ప్రకటించారు. అదే విధంగా యువతకు ఉద్యోగా అవకాశాలను కల్పిస్తామని, యువగళం నిధి కింద నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలను ఇస్తామని ప్రకటించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పని చేసి టిడిపి విజయానికి కృషి చేయాలని కోరారు. గ్రామంలో ఇంటింటికి వెళ్ళి టిడిపి ప్రకటించిన ఆరు పథకాల మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామసుబ్బయ్య, మాజీ ఎమ్పీపి ఆర్ఇ.రాఘవేంద్ర, సత్యం, లక్ష్మినారాయణ, మెట్టుపల్లె సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

**టిడిపిలో చేరిన వైకాపా కుటుంబాలు:**

మండల పరిధిలోని బాయిపల్లె గ్రామానికి చెందిన 50 వైకాపా కుటుంబాలు గురువారం డోన్ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి సమక్షంలో టిడిపి తీర్థాన్ని పుచ్చుకున్నారు. వైకాపా నుండి టిడిపిలో చేరిన వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మారం మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో టిడిపి విజయానికి కృషి చేయాలని కోరారు. టిడిపిలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికలలో కలిసికట్టుగా పని చేసి టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర కరువు బృందం సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసిన.. ఇంచార్జి కలెక్టర్ రాహుల్



**నంద్యాల, డిసెంబరు 14, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర కరువు బృందం సభ్యులను గురువారం నంద్యాల జిల్లా ఇంచార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ అతిథిగృహంలో కేంద్ర కరువు బృందం సభ్యులైన నీతి అయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారి అనరాధ బట్నా,జలశక్తి మంత్రిత్వశాఖ తాగునీరు, పారిశుధ్య విభాగం అసిస్టెంట్ అడ్వైజర్ సంతోష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రటరీ సంగీత్‌కుమార్‌లను కలిసి జిల్లా పరిధిలోని మండలాల్లో ఏర్పడ్డ కరువు పరిస్థితుల గురించి వివరించారు.

## అంగన్వాడీ కార్యకర్తలు అంటే సీఎంకు ఎందుకంత చులకన..!

**- మూడురోజులుగా సమ్మె చేస్తున్నా చలనం లేదా...**

**- మాజీ ఎమ్మెల్యే భూమా**

2లో



## ముస్లింల మీద.. కపటప్రేమ చూపుతున్న మాజీ ఎమ్మెల్యే..!

- హైకోర్టుకు వెళ్లి ముస్లింకు ఇంటిస్థలాలు రాకుండా అడ్డుకున్నది నీవు కాదా
- ఎన్నికల సమయంలో ముస్లింను వైసీపీకి దూరం చేయాలన్న దుర్మార్గ ఆలోచనలో నీవు ఉన్నావు - ఎమ్మెల్యే



**బనగానపల్లె, డిసెంబర్14, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణం కొండపేట లోని ప్రముఖ న్యాయవాది అబ్దుల్ ఖైర్ కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణ ప్రజల్లో నీ ముసుగు తొలగిపోయిందని, త్వరలోనే ప్రజలు నీకు బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు జగనన్న ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరు లబ్దిపొందుతుంటే అది చూసి ఓర్వలేక ముస్లిం మైనార్టీలను వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలనే దురాలోచనతో షాదిఖానాను తెరమీదకు తెచ్చి కపటనాటకాలు ఆడుతున్నారన్నారు. నువ్వు చేస్తున్న పనులన్ని బనగానపల్లె నియోజక వర్గ ప్రజలు గమనిస్తున్నారని 2024 ఎన్నికల్లో మళ్లీ బుద్ది చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు. బనగానపల్లె పట్టణంలో ముస్లింల శాతం అధికంగా ఉండగా వారికి ప్రభుత్వం అందిస్తున్న ఇంటిస్థలాలు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్దంగా ఉంటే ఇంటి స్థలాలు పంపిణీ చేస్తే వైఎస్సార్ సీపీకి ఎక్కడ మంచి పేరు వస్తుందన్న దురాలోచనతో హైకోర్టుకు వెళ్లి అడ్డుపడి ముస్లిం మైనార్టీ ప్రజలకు ఇంటి స్థలాలు రాకుండా శునకానందం పొందుతున్నావని చెప్పారు. పట్టణ ముస్లిం మైనార్టీల మీద కపటప్రేమ చూపుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో షాదిఖానా నిర్మాణానికి పూనుకున్నావని ఆయన అన్నారు. ఎక్కడ చూసిన అడుగడుగునా అభివృద్ధి అడ్డుతగులుతున్న చరిత్ర నీదని చెప్పారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, మండల జెడ్పీటీసీ సుబ్బలక్ష్మమ్మ, బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, బనగానపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, భానుముక్కల పరపతి సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, నూకల వెంకటసుబ్బయ్య, ఎంపిటిసి తాహీద్, సూరా కిషోర్, చక్రవర్తి టాకీస్ సాధక్, సునార్, ఎగ్బల్ హుస్సేన్, ఫ్రూట్ మర్చంట్ ఖలీల్, కూరగాయల రహిమాన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, సజ్జాత్ హుస్సేన్, లాయర్ సాజిద్ హుస్సేన్, జి.టి.వెంకట్రామిరెడ్డి, గౌండా వలి, ఆటోనగర్ సయ్యద్, తెలుగుపేట మద్దయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# "ఆడుదాం ఆంధ్ర" ఆటలు..!

**: క్రీడాకారులను వంద శాతం నమోదు చేయండి - జేసీ ఎన్.మౌర్య**



**కర్నూలు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** జిల్లాలోని ఆడుదాం ఆంధ్ర క్రీడలకు క్రీడాకారులను వంద శాతం నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వివిధ ప్రభుత్వ అంశాలపై జిల్లా స్థాయి అధికారులు మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కు సంబంధించి శనివారం రోజు నాటికి జిల్లాలో అంతట గ్రౌండ్ ల ఎంపిక అయ్యేలా చూడాలన్నారు. మండల స్థాయిలోనూ గ్రామస్థాయిలోనూ ఖాళీగా ఉన్న గ్రౌండ్ లను గుర్తించాలన్నారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి క్రీడల నిర్వహణకు క్రీడాకారులను వంద శాతం నమోదు చేసేలా ఎంపిడిఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మహిళ క్రీడాకారులను కూడా ప్రోత్సహించే దిశగా వారికి అవగాహన కల్పించి వారిని కూడా క్రీడలలో భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా నిర్వహణకు అవసరమైన మైదానాలను త్వరితగతిన గుర్తించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్పప్ యాత్రలో భాగంగా గ్రామ పంచాయతీలకు వెళ్ళినప్పుడు దండోరా వేయించి అందరూ పాల్గొని యాత్రకు సంబంధించిన ప్రతిజ్ఞ చేసేలా ఎంపిడిఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా శనివారం నాడు వికసిత్ భారత్ సంకల్పప్ యాత్రకు సంబంధించిన కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నిర్వహించనున్నారని, సదరు కార్యక్రమాన్ని విర్చ్యుయల్ విధానంలో పాల్గొనేందుకు గాను కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి గారు పాల్గొనే అవకాశం ఉన్నందున సదరు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గాను పెద్ద గ్రామ పంచాయతీ ఎంపిక చేయాలని కర్నూలు ఆర్డీఓ, జిల్లా పరిషత్ సీఈఓ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అబాది రీసర్వేకు సంబంధించి గూడూరు, ఎమ్మిగనూరుకు ఓఆర్ఐలు వచ్చాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రుథింగ్ పూర్తి అయిన వెంటనే 9(2) నోటీసులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె మధుసూదన్ రావు, జెడ్పి సీఈఓ నాసర రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మనస్పర్థలు రావడంతో రవిని హత్య చేశారు..!

**- ముద్దాయిలు అరెస్టు : సిఐ ముసురుద్దీన్**

**కోడుమూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** చిన్నపాటి గొడవలు, ఆవేశాలు, మనస్పర్థల కారణాలతో ఈ నెల 10వ తేది రాత్రి కోడుమూరు పట్టణానికి చెందిన బోయ రవిని ఇదే గ్రామానికి చెందిన బోయ శివ, అశోక్, రాములు హత్య చేశారని కోడుమూరు సిఐ ముసురుద్దీన్ తెలిపారు. ఈ మేరకు తాము హతుని తండ్రీ బోయ బజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపిసి 302 కింద కేసు నమోదు చేశామన్నారు. గురువారం ఈ హత్య కేసుకు సంబంధించిన ముద్దాయిలను శివ, రాము, అశోక్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ హత్య గావింప బడ్డ బోయరవిపై హత్యకు పాల్పడ్డ ముద్దాయిలు రోజు దిన కూలీలు చేసుకొని జీవనం సాగించే వారన్నారు. అయితే వీరి మధ్య గత కొంత కాలం నుంచి వ్యక్తి గత కక్షలు ఏర్పడ్డాయని వీటి వల్లే నేడు హత్యకు దారీ తీసిందని చెప్పారు. హత్య చేసిన తరువాత ముద్దాయిలు పరారిలో ఉన్నారని, ఈ కేసు ఛేదించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ బృందంలో కోడుమూరు ఎస్.ఐ ఎ.పి శ్రీనివాసులు, గూడూరు ఎస్.ఐ పీరయ్య, సిబ్బంది వీరన్న, రాముడు, భాష, అశోక్, రమేష్‌లు సహాయబద్దారన్నారు. ముద్దాయిలు కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామ బస్ స్టాప్ దగ్గర ఉన్నారన్న సమాచారం రావడంతో వెంటనే అక్కడికి పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకొన్నారని చెప్పారు. ఈ కేసుపై కోడుమూరు పోలీసులు నాలుగు రోజుల్లోనే ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందంతో హత్యకు సంబంధించిన ముద్దాయిలను పట్టుకోవడం జరిగిందని వివరించారు.



## ఉల్లిగడ్డకు, ఉర్లగడ్డకు.. తేడా తెలియని ముఖ్యమంత్రి

**- జిల్లా బిజెపి అధ్యక్షురాలు బైరెడ్డి శబరి**



**నంద్యాల డిశంబరు 14, ప్రభాతవార్త ప్రతినిధి** రాష్ట్రంలో వైసిపి అదికారములోకి వచ్చిన పదప అబివృద్ధి శూన్యమని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రంలోనే కాకుండ నంద్యాల జిల్లాలో ప్రతి ఎమ్మెల్యేలు 100కోట్లు ఖర్చు పెట్టి రూ 200కోట్లు సంపాదించకున్నారని జిల్లా బిజేపి అద్యక్షురాలు బైరెడ్డి శబరి సంచలమైన తీ వ్ర అరోపనలు చేశారు. గురువారము నంద్యాల పట్టణలంలో గవర్న మెంటు ఆసుపత్రి ఎదురుగా బిజేపి నంద్యాల అసెంబ్లీ స్థాయి నూతన కార్యాలయంను కన్వీనరు అబిరుచి మదు నంద్యాల జిల్లా ఇంచార్జి రమేషన్‌నాయకుడులతో కలిసి అమె లాంచనంగా ప్రారంబించారు. అంతకు మందుకు బిజేపి కార్యకర్తలు పెద్ద ఎత్తున బానా సంచాకాల్చుతు పూల వర్షము కురిపిస్తు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరము అమె విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అదికారములోకి వచ్చాక అబివృద్ది శూన్యమని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అరోపించారు...

2లో

## ఆర్యవైశ్య మహాసభ ప్రతిష్ట పెంచేందకు కృషిచేయాలి

**- రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్**



**కర్నూలు విద్య, డిసెంబరు 14, ప్రభాతవార్తః** ఆర్యవైశ్య మహాసభకు నూతన కార్యవర్గంలో ఎన్నికైన వారందరు మహాసభ ప్రతిష్టను మరింత పెంచే విధంగా పనిచేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎన్నికైన గుండా నాగ సుప్రజ టీజీ వెంకటేష్ దంపతులను వారి నివాసంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల అధికారి జయంతి వెంకటేశ్వర్లు, నంద్యాల ఆర్యవైశ్య మహాసభకు మహిళా విభాగం నూతన అధ్యక్షు రాలుగా ఎన్నికైన నాగసుప్రజ, ఆర్యవైశ్య మహా సభ ప్రతినిధులు బింగుమళ్ళ శ్యాంసుందర్ గుప్తా, భవనాశి నాగ మహేష్, మలిపెద్ది నాగరాజు, సతీష్‌కుమార్, గుండా మురళీధర్, శ్రీ రామసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టీజీ మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉన్న ఆర్యవైశ్య మహాసభకు నూతన కార్యవర్గంలో ఎన్నికైన వారందరు మహాసభ ప్రతిష్టను పెంచాలన్నారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్నికైన గుండా నాగ సుప్రజను అభినందించారు. అనంతరం గుండా నాగ సుప్రజ మాట్లాడుతూ రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆశీస్సులతో తాను ఈ పదవికి ఎన్నికయినట్లు తెలిపారు. ఆయన ఆశీస్సులు నిరంతరం తనకు ఉండాలని కోరారు. అందరిని కలుపుకొని పోయి ఆర్యవైశ్య మహాసభ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని వివరించారు.

# ఉల్లిగడ్డకు, ఉర్లగడ్డకు.. తేడా తెలియని ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి ) :
ప్రజలకు ఈతకాయలు ఇచ్చి తాటికా యలు తాగేసుకన్నచందానా మారింద న్నారు. రాష్ట్రంలో రైతులు యువత మహిళలు బిసి, ఎస్సి, ఎయస్‌టి వర్గాలకు న్యాయం చేయలేని ప్రభుత్వం అని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండరు ఇస్తామని యువతకు మాయ మాటలు చెప్పి గద్దె ఎకి క్కన వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లల్లో 10వేల మందికి ఉదో ్యగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నా రని విమర్శించారు. యువత ఇంజనీరింగ్ మెడిషన్ చదివి ఉద్యోగాలు లేక ఇబ్బం దుల ఎదుర్కొకుంటున్నారని చెప్పారు. పరిశ్రమలు తేలినివారు ఉన్నఒక్కటే లేకున్న ఒక్కటే అన్నారు. ఇతర రాష్ట్రాలకు మన యువత వలస పోతున్నదని చెప్పారు. ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రా లకు తరలి పోతున్నాయని చెప్పారు. జిల్లా అరు మండలాల్లో కరువు ప్రాంతా లుగా గుర్తించారని మండలాల్లోఉన్న ప్రజలు కుటుంబాలుసోషనకు పక్క రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. ప్రభుత్వానికి అవగామణ లేదన్నారు. చదువు లేక పోయినప డబ్బు వున్నవారికి ఎంపి, ఎమ్మెల్యే, మినిస్టరీ సలహాదారులు వైసిపి పార్టి లో ఉన్నారని ఆరోపించారు. వరదల్లో ప్రజలు పండించిన పంటలు నష్ట పోతే వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరంనుంచే చేతులు ఊపుతూ అనుపత్రిలో బాదితులతో నవ్వుతూ సిగ్గు పడుతూ పరామరి ్శంచడము సిగ్గు చేటన్నారు. ఉల్లిడ్డకు ఉర్లగడ్డకు తేడా తెలియని ఏకైక ముఖ్యమంత్రిని మన ప్రజలు చూశారని ఆరోపించారు. నంద్యాలల్లో ప్రజలకు మంచి చేయాలని వైసిపి పార్టి నేతలకు లేదన్నారు. ప్రజలు బిజేపితో అబివృద్ది జరుగుతుందని అశిస్తున్నారని చెప్పారు. అంధ్రప్రదేశ్‌లో బిజేపి బలోపేతానికి కృషిచేస్తుందన్నారు. జిల్లాలో బిజేపిలో యువ రక్తం ఉరకలేస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బూత్ కమిటిలు మోర్చా కమిటిలు వేస్తూ పార్టి బలోపేతానికి కృషి చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని నియోజక వర్గాం లో అసెంబ్లీ బరిలో బిజేపి అభ్యర్థులు నిలబడతారని చెప్పారు. 37మండలాల్లో 36మండాల్లో బూత కమిటిలు మోర్చా కమిటిలు పూర్తి అయ్యాయన్నారు. రాష్ట్ర బిజేపి అద్యక్షురాలు అదేశాల మేరకు నంద్యాల నియోజక వర్గంలో కార్యాలయంను ఏర్పాట్లు చేవామన్నారు. అబిరుచి మదును పార్టి కన్వినరుగా నియమించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బరిలో మదు ఉంటారని చెప్పారు.

## అంగన్వాడీ కార్యకర్తలు అంటే సీఎంకు ఎందుకంత చులకన..!

**నంద్యాల టెక్కె, డిసెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గత మూడు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేకపోవడం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. నంద్యాల పట్టణం తహశీల్దారు కార్యాలయం ఎదుట గత మూడురోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరాహారదీక్షలు చేస్తున్నారు. అంగన్వాడీ దీక్షలకు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ప్రముఖ న్యాయవాది జేవీ.మనోహర్‌రెడ్డిలతోపాటు పలువురు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి పల్లెలోను అంగన్వాడీ సెంటర్లల్లో కార్యకర్తలు, ఆయాలు ఉంటారని ప్రజల సంక్షేమ కార్యక్రమాలు వీరి ద్వారానే జరుగుతున్నప్పటికి వారికి సరైన వేతనం ఇవ్వడం లేదని వారు గొడ్డుచాకిరి చేస్తున్నారని పేర్కొన్నారు. వారిని ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించాలని, వారి నెలసరి వేతనం రూ.26వేలకు ప్రకటించాలని ఆయన డిమాండ్‌చేశారు. మూడునెలలు ఆగితే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టాక మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాడని భూమా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, అంగన్వాడీ నాయకురాళ్లు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## పడమర ప్రాతకోటలో భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమం

**పగిడ్యాల, డిశంబరు 14,ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం పడమర ప్రాతకోటలో మండల తెలుగుదేశం నాయకులు డాక్టర్ పిట్టల నాగేశులు ఆధ్వర్యంలో గురువారం రాత్రి భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమంలోబాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిపేస్టో గురించి తెలుగుదేశం నాయకులు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి,లక్ష్మణ్ణ, శ్రీధర్, బోయ శంకర్, కాశి, నాగేశ్వరావు, రాముడు, రేపల్లె మహేష్, మల్లయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, లింగమయ్య,బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా

**మంత్రాలయం,డిసెంబర్ 14,ప్రభాతవార్త:** క్రీడాకారులను ప్రోత ్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైసిపి మండల అధ్యక్షులు భీంరెడ్డి,ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డిలు అన్నారు.మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆడుదా ం ఆంధ్రా కిట్లను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.ఈ నెల 26వ తారీఖు నుండి ఈ క్రీడాపోటీలు ప్రారంభమవుతున్నట్లు వారు తెలిపారు.ఆసక్తి కలిగిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మణిమంజరి,ఈఓఆర్‌డి ప్రభావతి,వైస్ ఎంపిపి రాఘవేంద్ర,బొం బాయి శివ,పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్,ఇస్రత్ భాష,చిరంజీవి,స్వామినాధం,వీరేష్ పాల్గొన్నారు.

## 16న సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**ఆదోనిలీగల్, డిసెంబర్14, ప్రభాతవార్త;** నూతనంగా ఏర్పాటు అవుతున్న ఆదోని మెడికల్ కళాశాలలో పనిచేయడానికి సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 16వ తేదీన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇంటర్వ్యూలు (వాక్ ఇన్ ఇంటరూ ్వ) నిర్వహిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె.వాణిశ్రీ తెలిపారు. శుక్రవారం ఆమె ప్రభాతవార్తతో మాట్లాడారు. 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలకు కర్నూలు వైద్యశాల (కర్నూలు వెబ్‌సైట్స్)లో పొందుపరచడం జరిగిందన్ననరు. వైద్య పీజీ కోర్సు పూర్తి చేసుకున్న వారు ఈ ఇంటర్వ్యూలకు అర్హులుగా పరిగణిస్తారని చెప్పారు.

## గోడపత్రికలు విడుదల

**బేతంచెర్ల,డిసెంబర్14,ప్రభాతవార్త:** కర్నూలులో ఈనెల 15 నుండి 17వ తేది వరకు జరిగే ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల గోడపత్రికలను ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు,సీపీఎం నాయకులు ఈశ్వరయ్యలు గురువారం విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు,వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పై పోరాటాలకు సిద్దమవ్వడానికి నిర్వహించే ఈ సమావేశానికి రైతులు,వ్యవసాయ కూలీలు,కార్మికులు అధిక సంఖ ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.వారితోపాటు రైతు సంఘం నాయకులు కిట్టన్న,సీతారామాపురం వెంకటేశ్వర్లు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలిగా గుండా సుప్రజ ఎంపిక



**బనగానపల్లె,డిసెంబర్14,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలిగా బనగానపల్లె పట్టణానికి చెందిన గుండా సుప్రజను మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ప్రస్తుతం గుండా సుప్రజ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ తొలి మహిళా గవర్నర్‌గా,మెటివేషనల్ ట్రైనర్‌గా,సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్‌గా ఉమ్మడి కర్నూలు,నంద్యాల జిల్లాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా గుండా సుప్రజ మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి ఎంతో బాధ్యతతో కూడుకున్న నంద్యాల జిల్లా ఆర్యవైశ ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా టీజీ వెంకటేష్ ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు చేపట్టి మహిళా సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె అన్నారు.

## గొర్రెలపెంపకందారుల అధ్యక్షులుగా మైలూరి మద్దయ్య



**అవుకు,డిసెంబర్14,ప్రభాతవార్త:** అవుకు పట్టణంలో శ్రీరాధాకృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి సంబంధించి ఎన్నిక రైతుభరోసా కేంద్రం లో గురువారం నిర్వహించారు.ఈ ఎన్నికకు కొలిమిగుండ్ల పశువైద్యాధికారి ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.ఈ ఎన్నికలో 72మంది సభ్యులు పాల్గొన్నారు.ఇందులో 16 మంది నామినేషన్లు వేయగా 16 మందిని రెండు వర్గాలుగా విభజించారు.మొదటి వర్గం లింగాల నడిపి మద్దయ్య మరియు మహేష్ యాదవ్ రెండవ వర్గం మైలూరి మద్దయ్య,ఎర్రప్ప గారి మద్దిలేటి మధ్య ఎలక్షన్లు నిర్వహించారు.ఈ ఎలక్షన్లలో మైలూరి మద్దయ్యకు 37ఓట్లు రాగా రెండవ వర్గానికి 33 ఓట్లు వచ్చాయి.ఈ ఎలక్షన్‌లో 4ఓట్ల తేడాతో మైలూరి మద్దయ్య గెలుపొందారు.ఈ సందర్భంగా అధ్యక్షులుగా మైలూరి మద్దయ్య,సెక్రటరీగా ఎర్రప్పగారి మద్దిలేటి,డైరెక్టర్లుగా మేకల శ్రీనివాసులు,ఆదిమద్దిలేటి,మద్దిలేటిస్వామి, చంద్రశేఖర్,సురేంద్ర కుమార్ మరియు గణమద్దిలేటిలు ఎన్నికయ్యారు.ఈ ఎలక్షన్‌లో గెలుపొందిన వారికి డాక్టర్ జి.పద్మావతి డిక్లరేషన్ ఫారమ్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో అవుకు పశువైద్యాధికారులు భారతిదేవి,తస్లీమ్,ఎస్.రాజేష్,అనిల్,చరణ్,నీలకంఠం,గోపాల్ పాల్గొన్నారు.

## మూడవ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



**బండిఆత్మకూరు, డిసెంబరు 14, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం నందు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ మోకాళ్ళపై నిలబడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిఐటియు మండల కమిటీ అధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. సమ్మెకు మద్దతుగా జర్నలిస్టు యూనియన్ నాయకులు జి రంగస్వామి, జమాల్‌బాష, సురేష్, అలీ, రామరాజు మద్దతు తెలిపారు. ఈసందర ్భంగా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు రంగస్వామి మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉదో ్యగులుగా గుర్తించాలని అంగన్‌వాడీలు చేసే న్యాయమైన పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. అంగన్‌వాడీల సమ్మెకు మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, డివైఎఫ్ జిల్లా నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని రాష్ట్రంలోని అన్నిసంఘాలను కలుపుకొని పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు. మూడవరోజు అంగన్‌వాడీ కార్యకలాపాలు అన్ని సెంటర్ల వారు సంపూర్ణంగా బంద్ ప్రకటించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, శ్యామలమ్మ, వసంతలు మాట్లాడుతూ గత 48 సంవత ్సరాలుగా తమకు ఉద్యోగ భద్రత లేదని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. బాలింతలకు, గర్భిణిలకు అనేక సేవలు అందిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతం రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు దేవిడ్, రామచంద్రుడు, సుబ్బరాయుడు, డివైఎఫ్ జిల్లా నాయకులు రాజేష్, సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, మండల నాయకులు రాజు, భవన నిర్మాణశాఖ కార్మికుడు అయూబ్‌లు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపిక

**బనగానపల్లె,డిసెంబర్14,ప్రభాతవార్త:** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీకళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్.మహబూబ్ బాషా సౌత్‌జోన్ వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకురాలు జి.విజయకుమారి తెలిపారు.ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ సౌత్‌జోన్ క్రీడలకు ఎంపికైన విద్యార్థి ఈనెల 18వ తేది కర్నూలు నందు శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు.అనంతరం కర్నాటక రాష్ట్రం బెల్గంలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్శిటీలో ఈనెల 22వ తేది నుండి 25వ తేది వరకు జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఈ మేరకు ఎంపిక విద్యార్థి మహబూబ్ బాషాను కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి,అధ్యాపకులు అభినందించారు.

## ప్రభుత్వం స్పందించేంత వరకు ఉద్యమం ఆగదు

**ఆత్మకూరు డిసెంబర్14,ప్రభాతవార్త:** అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలను వైసిపి ప్రభుత్వం స్పందించేంత వరకు ఉద్యమం ఆగదని రైతు సంఘం అధ్యక్షులు మాబాష, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహానాయక్, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడిల సమస్యలపై 3వ రోజు మోకాళ్లపై నిలచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడిలకు తెలంగాణ కన్న ఆదనంగా వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు కల్పించాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన హెల్పర్స్‌కు ప్రమోషన్లు అవకాశం కల్పించాలన్నారు. రాజకీయ జోక్యం అరికట్టి వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ మెను చార్జీలను పెంచి గ్యాసును ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు తక్షణమే మంజూరు చేసి అంగన్‌వాడిల సమస్యలను పరిష్కరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మిదేవి, ప్రమీలమ్మ,అన్నలదాసు వాణి, చెన్నమ్మ, సుజాత, ప్రియాంక, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారణ కోటి జన్మల పుణ్యఫలం

**:- పంచాయతీరాజ్ వింగ్ అండ్ జోనల్ కర్నూలు,నంద్యాల జిల్లాల అధ్యక్షులు,చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి**

**ఆలూరు,డిసెంబరు 14,ప్రభాతవార్త లి** అయ్యప్ప మాలధారణ కోటి జన్మల పుణ్యఫలమని పంచాయతీరాజ్ వింగ్ అండ్ జోనల్ కర్నూలు,నంద్యాల జిల్లాల అధ్యక్షులు,చిప్పగిరి జడ్‌పిటిసి విరుపాక్షి అన్నారు. గురువారం ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం చిప్పగిరి గ్రామంలో శ్రీ అయ్యప్పస్వామి మహా పడిపూజ మరియు ఇరుముడి కార్యక్రమం గురుస్వామి జడ్‌పిటిసి విరుపాక్షి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జడ్‌పిటిసి విరుపాక్షి 48రోజులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సొంత ఖర్చులతో అయ్యప్పస్వాములు,శివస్వాములు,భవాని స్వాములకు రూ.3లక్షలతో అన్నదాన కార్యక్రమం,ఊరేగింపు,ఇరుముడి, మహాపడిపూజ కార్యక్రమం సొంత ఖర్చులతో అయ్యప్పకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వేలాది జనం మధ్యలో శ్రీ భోగలింగేశ్వర దేవాలయంలో మహా పడిపూజ,ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. మాలవేసిన అయ్యప్పస్వాములు మాట్లాడుతూ 48రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన గురుస్వామి విరుపాక్షిని అయ్యప్ప భక్తమండలి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నందికొట్కూరు,డిసెంబర్ 14, ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల ఫీల్డు అసిస్టెంట్ల సంఘం నాయకులు శ్రీనువాసులు, మునిస్వామి,స్వాములు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యం.పి.డి.ఓ.శోభారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు పని దినాల విధానం రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, పని దినాల టార్గెట్ విధానం రద్దు చేసి ఫీల్ అసిస్టెంట్ల అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడు సంవత్సరాలు పూర్తి అయిన వారి అర్హత, అనుభవం కలిగిన ఫీల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించి మున్సిపాల్టి పరిధిలో విలీనమైన గ్రామ పంచాయితీలలో యధావిధిగా ఉపాధి హామీ పథకం అమలు చేయాలన్నారు. జూనియర్,సీనియర్ అనే తారతమ్యం లేకుండ అందరినీ ఫీల్డు అసిస్టెంట్‌లుగా కొనసాగించాలని, ప్రమాద వశాత్తు మరణించిన వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేసియా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు హైమావతి,పద్మావతి, శేషన్న, సుధీర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

**పగిడ్యాల, డిశంబరు 14,ప్రభాతవార్త :** ప్రతిగ్రామసచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించవలసిన బాధ్యత వాలంటీర్ల, గ్రామపంచాయతీ కార్యదర్శులపైఎంతైనావుందనీ ఎంపిడిఓ బివి.రమణ, తహశీల్దార్ భారతి, ఎంఈఓ పి.సుభాన్ అన్నారు. స్థానిక ఐకెపి కార్యాలయంలోని సమావేశభవనంలో గురువారం వాలంటీర్లకు పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర్వాహణపైమార్గదర్శకాలను వివరించారు. మండల పరిధిలోనిప్రతి గ్రామసచివాలయ పరిధిలో శుక్రవారం ఆయ క్రీడాపోటీలకు సంబంధించి పోటీలను నిర్వహించాలన్నారు. గెలుపొందిన జట్లు మండల స్థాయిలో నిర్వహిస్తారనీ, వారిలో విజేతలైన జట్లను జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో నిర్వహించేపోటీలలో గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేస్తారనీ ఎంపిడిఓ బివి.రమణ, తహశీల్దార్ భారతి, ఎంఈఓ పి.సుభాన్, ఎంఈఓ -2 మురళీమోహన్‌రెడ్డి, పగిడ్యాల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్. మోహన్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, శిక్షకులు కె.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వాలంటీర్లు పిఎస్‌లు పాల్గొన్నారు.

## దళితుల పంతము వైసిపి అంతము

**నంద్యాల విద్య,డిశంబరు 14,ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వం ఈనాలుగున్నర ఏళ్ల కాలంలో వైసిపి పార్టిలో ఉన్నటువంటి దలితులకే కాకుండా రాష్ట్రంలో ఉన్న దళితవర్గానికి అందరిన మోసము చేసిందని నా ఎస్సి బిడ్డలు అంటు వారిని అణదొక్కెందుకే ప్రయత్నము చేసిన జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంతము చేసేందుకు అందరము కలిసి కట్టుగా కృషి చేయాలని దళిత శంఖారావములో ఎస్సి సామాజిక నాయకులు పేర్కొన్నారు.గురువారము నంద్యాలల్లో టిడిపి కార్యాలయంలో దళిత శంఖారావ సభను ఎస్టి విభాగము రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ రాజు అద్వర్యంలలో నిర్వహించారు. ఇందులో టిడిపి జిల్లా అధ్యక్షలు మల్లెల రాజశేఖరు నంద్యాల టిడిపి ఇంచార్జి మాజీ మంత్రి ఫరూక్ ఎస్సి అధ్యక్షులు దామోదర నాగేశు రాష్ట్ర ఎస్సి సెల్ ప్రదాన కార్యదర్శి మద్దికేర కైలాస్ టిడిపి నాయకుడు ఫిరోజ్,తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈసందర్బము వారు మాట్లాడుతూ అంబేత్కరు అశయాల అనుగునంగా దళితులకు సంక్షేమ పథకాలు అందించాలని అవి అందటము లేదన్నారు. సబ్సిడీ పథకాలన్ని ఎత్తివేశారని అరోపించారు. నా ఎసి ్సలు,నా ఎస్టిలు దళితబిడ్డలకు మేనమామ నంటూ ఓట్లు దండుకున్న వైయస్ జగన్ అదికారములోకి వచ్చాక దళితులను అన్ని విదాలుగా అనగతొక్కుతున్నారని ముఖ్యమంత్రి తీరుపై వైసిపి పార్టిలోని దళిత నేతలు మంత్రులు మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడులు అరాచకాలు అకృత్యాలు అత్యాచారులను అడ్డుకట్ట వేయాలంటే వచ్చే ఎన్నికల సంగ్రామంలో దళితులంతా ఐక ్యమత్యంతో చంద్రబాబునాయుడికి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపు నిచ్చారు. వైసిపి ప్రభుత్వందళితులు తమ ఉనికిని కోల్పోతున్నారని అవేదన వ్యక్తం చేశారు.

## సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తాం

**పగిడ్యాల, డిశంబరు 14,ప్రభాతవార్త :** సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామనీ అంగన్వాడీ వర్కర్స్‌ఆండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కుర్షిద్‌బీ, సాజిదబేగం, పద్మ, ప్రభావతమ్మ, రాములమ్మ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షల్లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ అండ్‌హెల్పర్స్ మోకాళ్ళపై నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంవల్ల మూడవ రోజుమోకాళ్ళపై నిరసన తెలిపామన్నారు. ఏవస్తువులు కానాలన్నా ధరలు విపరీతంగాపెరిగిపోతున్నాయనీ కానీ మావేతనాలు పెంచాలనీ రాష్ట్రప్రభుత్వపై గత నాలుసంవత్సరాల నుంచి అనేక దశలవారిగా ప్రభుత్వానికి విన్నవించినాఫలి తంలేదనీ ఆంగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమానవేతనం రూ.26000లు ఇచ్చిప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి న్యాయమైన మా 14న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలనీ లేనిపక్షంలో దశలవారిగాఆ ఉద్యమాన్ని ఉదృతం చేస్తామనీ వారుహెచ్చరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి,అంగన్వాడి, హెల్పర్ యూనియన్ నాయకులురాల్లు, కార్యకర్తలు, ఆయాలుపాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు భారతికి వినతిపత్రం సమర్పించారు.

## బిజెపి పార్టీలోకి 15మంది చేరిక



**ఆస్పరి,డిసెంబరు 14,ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిగలి,అట్టెకల్లు గ్రామానికి చెందిన 15మంది బిజెపి పార్టీలోకి చేరారు. గురువారం మండల కేంద్రమైన ఆస్పరి గ్రామ సమీపంలో ఉన్న రామతీర్థంలో బిజెపి పార్టీ మండల సమావేశాన్ని బిజెపి మండల అధ్యక్షులు అర్పణ నరసప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి బిజెపి ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాస్ హాజరై చిగలి,అట్టేకల్ గ్రామాల నుంచి గద్ద నాగరాజు,వద్దే నెట్టేకల్లు,వద్దే చంద్ర,గద్ద నరసింహులు,వద్దే శేఖర్,వద్దే నాగరాజు,మద్ది శేఖర్,గట్ల శేఖర్,పటారీ వీరేష్‌తో పాటు మరికొంతమందికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ విధివిధానాలు,క్రమశిక్షణ,సిద్దాంతాల గురించి అలాగే బిజెపి ప్రభుత్వం ద్వారా భారతదేశ ప్రధానమంత్రి మోడీ పేదలకు ప్రవేశపెట్టిన ఎన్నో పథకాల గురించి వివరించారు. ఆస్పరి మండలంలో బిజెపి పార్టీ సిద్దాంతాలు నచ్చి కొంతమంది పార్టీలోకి చేరడం ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు హాలిగేర నారాయణ,మండల నాయకులు రామదాసు,కరుణాకర్,గోవింద్‌స్వామి,వీరేష్,కిష్టప్ప పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం ఆగదు

**– మోకాళ్లపై నిలుచుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లు..**

**వెల్దుర్తి,డిసెంబర్14,ప్రభాతవార్త :** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం ఆగదు అని అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్ల సంఘం నాయకులు చాందినీ,ఈదమ్మలు తెలిపారు.సానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 3వ రోజుకు చేరుకుంది.వారు మోకాళ్లపై నిలుచుని తమ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను వైకాపా ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దాకా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యమిస్తామన్నారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చేయాలని కోరారు.అంగన్‌వాడీలకు తెలంగాణ తరహాలో అదనంగా వేతనాలు పెంచాలన్నారు.పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు.బిల్లులు రాకున్న తమ స్వంత డబ్బుతో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నామన్నారు .గ్రామంలో ఏ కార్యక్రమం జరిగిన తాము పాల్గొని సేవలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకులు చాందినీ,ఈదమ్మ,జయలక్ష్మీ,వరలక్ష్మీ,మల్లేశ్వరి, మహేశ్వరి,షబానా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## గాడి తప్పిన వైసీపీ ప్రభుత్వ పాలన

**చాగలమర్రి,డిసెంబర్14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలన గాడి తప్పిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎం.ఎస్.అన్సర్ బాషా విమర్శించారు.గురువారం స్థానిక గుంతపాలెం కాలనీలోని 229వ బూత్‌లో మాజీ మంత్రివర్యులు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార ్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి ష్యూరిటీ పత్రాలను అందజేస్తూ బాబు వస్తే అమలుపరిచే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల,విద్యుత్ చార్జీలు,బస్సు చార్జీలు,పెట్రోల్,డీజిల్,చివరకు చెత్త పై పన్ను విధిస్తు ప్రజల నడ్డి విరుస్తున్న రన్నారు.పాలన పూర్తిగా గాడితప్పిందని అభివృద్ధి ఎక్కడ కనుచూపుమేర కనపడడంలేదన్నారు.రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియను గెలిపించుకొని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెంది ప్రజలకు ఇంతకంటే మెరుగైన సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదార్ సాహెబ్,జింక చిన్నమదార్ వలి,పెద్ద మహమ్మద్,క్లస్టర్ ఇన్‌చార్జ్ ముల్లా అజీమ్,ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్,ప్రధాన కార ్యదర్శి ముల్లా అలంసాగర్‌గారి అనిఫ్,రియాజ్,వీరమ్మగారి ఖాజా రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై కక్ష్యసాధింపు చర్యలు తగదు

**ఆలూరు,డిసెంబరు 14,ప్రభాతవార్త :** ప్రభుత్వం అంగన్‌వాడీలపై కక్ష్యసాధింపు చర్యలు తగదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి,అంగన్‌వాడి వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ తాలుక కార్యదర్శి జయశ్రీలు అన్నారు. గురువారం పట్టణంలో బస్టాండ్ నందు అంగన్‌వాడీల వేతనాల పెంపు,ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర అంశాలపై చేపట్టిన సమ్మె మూడోరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు విన్నూత్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారికి సిపిఐ సీనియర్ నాయకులు భూపేష్,మండల కార్యదర్శి రామాంజనేయులు,రైతుసంఘం తాలుక కార్యదర్శి హోతూరప ్ప,శివ,సిపిఎం మండల కన్వినర్ షాకీర్,కృష్ణలు మద్దతు తెలిపి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని,రిటైర్మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు భారతి,బాలరంగమ్మ,లక్ష్మీ,సరస్వతి, సుజాత,ప్రభావతి,పుష్పావతి తదితరులున్నారు.

## కేంద్ర బృందానికి వినతిపత్రాలను అందజేసిన సీపీఐ సీఎం నాయకులు

**బేతంచెర్ల,డిసెంబర్14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాభావం వల్ల నెలకొన్న కరువును పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందానికి కర్నూలు జిల్లాను,నంద్యాల జిల్లాను కరువు జిల్లాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు,సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్,జిల్లా కార్యవర్గ సభు ్యలు సుంకయ్య,రాధాకృష్ణ,రైతు సంఘం జిల్లా నాయకులు నారాయణ,సోమన్న,సీపీఎం నాయకులు ఈశ్వరయ్య,ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడులు వినతిపత్రాలు అందజేశారు.గురువారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం తదితర గ్రామాల్లో పంటలను కేంద్ర కరువు బృందం పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డోన్ అగ్రికల్చర్ ఏడీ అశోక్‌వర్ధన్‌రెడ్డి,తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి,మండల వ ్యవసాయాధికారి కిరణ్ కుమార్,సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్,పలు సంఘాల నాయకులు,కే ంద్ర బృందం ప్రతినిధులు,ఏపీ రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## వినియోగదారులు విద్యుత్ పొదుపును పాటించాలి

**కొలిమిగుండ్ల,డిసెంబర్14,ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులు ఎంతో విలువైన విద్యుత్‌ను వృథా చేయరాదని,విద్యుత్ పొదుపు పాటించాలంటూ కొలిమిగుండ్ల మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్నాంజనేయులు పేర్కొన్నారు.గురువారం స్థానిక మోడల్‌స్కూల్ నందు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ పొదుపు పై అవగాహన కార ్యక్రమం నిర్వహించారు.విద్యుత్ వృథా చేయడం వల్ల భవిష్యత్ తరాలకు చీకట్లు మిగులుతాయని ప్రతిఒక్కరు విద్యుత్ పొదుపును పాటించాలని సూచించారు.విద్యార్థులు విద్యుత్ పొదుపు పై అవగాహన పెంచుకోవడంతోపాటు తల్లిదండ్రులకు అవగాహన కలి ్పంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

**- వైకాపా మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి**

**వెల్దుర్తి,డిసెంబర్14ప్రభాతవార్త :** జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి ప్రజలను,లబ్ధిదారులను కోరారు.స్థానిక సచివాలయం-3లో గురువారం వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బొమ్మనరవిరెడ్డి,ఎంపిడిఓ శ్రీనివాసరావు,సచివాలయం అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి సచివాలయంలో సంక్షేమపథకాల బోర్డును ఆవిష్కరించారు.అనంతరం పార్టీ నాయకులు,కార్యకర్తలు,గృహసారథులు,సచివాలయం కన్వీనర్లతో కలిసి వైఎస్సార్ ్సపీ జెండాను రవిరెడ్డి ఎగురవేశారు.సచివాలయ పరిధిలోని గడపగడపకు ఆయన తిరుగుతూ ప్రజలకు,లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను వివరించారు.రాబోవు రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైకాపాకు మద్దతు పలకాలని కోరారు.మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా,పత్తికొండ ఎమ్మెల్యేగా కంగాటిశ్రీదేవిని గెలిపించుకుందామన్నారు.అదేవిధంగా ఎస్.బోయినపల్లి,రామళ్లకోట గ్రామాల్లో ఆయా గ్రామ వైకాపా నాయకులు నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి,రాధాక్రిష్ణారెడ్డి,మాధవస్వామి, శ్రీనివాసులు, మాలిక్‌బాష,రామయ్యలు వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం గ్రామ నాయకులు,గృహసారథులు,సచివాలయం కన్వీనర్లతో కలిసి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి,బ్రహ్మగుండం ఛైర్మెన్ బొమ్మన పెద్దిరెడ్డి,జడ్పీటిసి దాదిపోగు సుంకన్న,సర్పంచ్ ముత్యాల శైలజదేవరాజ్,నాయకులు రఘురెడ్డి, గట్టు ఆరిఫ్,శివారెడ్డి,ఎంపిటిసి సభ్యులు పెద్దన్న,రాజు,వైకాపా నాయకులు దేవరాజు,డేవిడ్,హాఫీజ్,సచివాలయం కన్వీనర్లు,గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు టిడిపి సంపూర్ణ మద్దతు

**ఆస్పరి,డిసెంబరు 14,ప్రభాతవార్త :** అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు టిడిపి సంపూర్ణ మద్దతు తెలిపినట్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రినాయుడు,ఎంపిటిసి నరసన్న,మాజీ సొసైటీ చైర్మన్ నౌనేపాటి చౌదరి, మాజీ మండల కన్వినర్ శ్రీనివాసగౌడ్‌లు తెలిపారు. గురువారం సిడిపిఓ కార్యాలయం ముందు మూడోరోజు నిరవధిక సమ్మెను అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు విజయలక్ష్మి,జ్యోతిల అధ్యక్షతన కొనసాగించారు. ఈ సమ్మెకు టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడిల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో వైసిపి మొండి వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తమ అధినేత చంద్రబాబుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలను విస్మరిస్తుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు ఇవ్వాలని,హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి,రాజశేఖర్,ఉరుకుందప్ప,తెలుగు యువత నాయకులు రాజ్‌కుమార్,మల్లేషప్ప, వీరేష్,సిద్దు,ఆచారి,అంగన్‌వాడీ టీచర్లు ప్రమీళమ్మ,రాధమ్మ, జయమ్మ, విశ్వకుమారి,రసూల్ బేగం,లతాశ్రీ, పద్మ, సరోజమ్మ,నాగమణి,విజయలక్ష్మి,చిట్టెమ్మ,గీతావాణి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కోసిగయ్య గుడిలో కార్తీక మాస ముగింపు ఉత్సవాలు..



**కోసిగి డిసెంబరు 14, ప్రభాతవార్త:** కోసిగి ప్రజలకు ఆరాధ్య దైవమైన శ్రీ కోసిగయ్య దేవాలయంలో కార్తీక మాస ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.. బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం తెల్లవారుజాము వరకు ఈ దేవాలయం ప్రాంగణంలో దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.. కార్తీక మాస నెల రోజుల నుండి కోసిగయ్య స్వామికి నిత్య పూజలు చేసి భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ మొక్కు బడులను చెల్లించేందుకు ఎమ్మిగనూరు, ఆదోని, రాయచూరు, సిరుగుప్ప ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి రాత్రి అంత జాగారణ చేసారు..ఈ సందర్భంగా స్వామి వారి ప్రతిమకు వెండి కవచం తొడిగించి, రుద్రాభిషేకం, మహాభిషేకం, ఆకుపూజలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. కోసిగయ్య భక్తుల కోలాహలం మధ్య ఈ పూజోత్సవం పూజారి దుర్గప్రసాద్‌స్వామి నిర్వహించారు..ముఖ్యంగా కోసిగి వాసులకు అత్యంత ప్రీతికరమైన కోసిగయ్యకు సంబందించి జరుగుతున్న ఈ కార్తీకమాస ముగింపు ఉత్సవాలను ప్రతి కుటుంబంలో ఆనందభరితంగా పిల్లా పాపలతో కలసి ఉత్సవాలను చేసుకున్నారు.. పండుగను చేసుకుని బంధువులను, శ్రేయోభిలాషులను ఆహ్వానించి ఈ పండుగను చేసుకోవడం విశేషం..

## శ్రీశైలం వైసిపి టికెట్ రేసులో బుడ్డా శేషారెడ్డి...!



**ఆత్మకూరు డిసెంబర్14,ప్రభాతవార్త:** ఈసారి జరగబోయో ఎన్నికలో వైసిపి పార్టీలో కొత్త అభ్యర్థులను బరిలో నిలిపేందుకు పార్టీ అదిష్టానం కసరత్తు మొదలు పెట్టిన విషయం అందరికి తెలసిందే. అయితే కొన్ని నియోజకవర్గాలలో అసమతి, అసంతృప్తి ఉన్న నాయకులపై ప్రత్యేక నిఘా వర్గాలు ఉన్నప్పటికి రాష్ట్ర వైసిపి అదిష్టాన నిర్ణయం మేరకు కొత్త వారికి ఎంఎల్ఏ అభ్యర్థి టికెట్ అవకాశం కల్పించేందుకు ముమ్మరంగా లోగుట్టు రాజకీయాలను కొనసాగిస్తున్నారు. ఇది వరకే రాష్ట్రంలో కొన్ని అసెంబ్లీ స్థానాలలో ఇంచార్జీలను నియమించిన విషయం అందరికి తెలసిందే. ప్రస్తుతం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం వైసిపి టికెట్ రేసులో రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి ఉన్నట్లు కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హార్శం వ్యక్తం చేస్తున్నారు. 2024 సంవత్సరం సార్వత్రిక ఎన్నికలో శ్రీశైలం నియోజకవర్గం వైసిపి టికెట్‌పై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపధ్యంలోనే నియోజకవర్గంలో రోజుకో ఒక రాజకీయం మలుపు తిరుగుతుంది. 2014 ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గంలో ఇంచార్జీగా పార్టీ పగ్గాలు చేపట్టిన బుడ్డా శేషిరెడ్డి, పార్టీలో పెనుమార్పులు జరగడంతో కొన్ని రోజుల పాటు టికెట్ కోసం మౌనం పాటించారు. 2019 ఎన్నికల్లో వైసిపి టికెట్ నుంచి బరిలో నిలిచే విదంగా ప్రయత్నాలు కొనసాగించారు. అయితే ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయాల పరిణామాల దృష్ట్య ఈసారి జరగబోయో ఎన్నికలో తప్పని సరిగ్గా బుడ్డా శేషిరెడ్డికి శ్రీశైలం నియోజకవర్గం వైసిపి టికెట్ వస్తుందనే విషయాని పార్టీ పెద్దల దగ్గర తీవ్రమైన చర్చలు కొనసాగుతున్నాయి. ఏదిఏమైన్నప్పటికి నియోజకవర్గంలో త్వరలోనే రాజకీయ పెనుమార్పులు వైసిపి పార్టీలో అధికంగా జరగవచ్చనే విషయం చర్చనీయాంశంగా మారిందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

## ఉపాధి పనుల్లో కేవలం రూ.8422 మాత్రమే అవినీతి

:-డ్వామా పిడి అమర్‌నాథ్‌రెడ్డి



**మంత్రాలయం,డిసెంబర్ 14,ప్రభాత వార్త:** మంత్రాలయం మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను జరిగిన ఉపాధి హామీ పనుల్లో కేవలంరూ.8422 మాత్రమే అవినీతి జరిగినట్లు డ్వామా పిడి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజావేదికలో ఈ వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ,పంచాయతీరాజ్ పనులు,సామాజిక పింఛన్లు తదితర పనుల్లోవారంపాటు జరిపిన సామాజిక తనిఖీల్లో ఈ విషయాలు తెలిసినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా ఫీల్డ్ సిస్టెం ట్‌లు,టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ.18,000 పెనాల్టీ విధించినట్లు తెలియజేశారు.ఈ మొత్తం రూ.26, 422 నగదును సంబంధిత సిబ్బంది నుండి వారంలోపు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ పిడి మాధవిలత,ఏపిడి లోకేశ్వర్,డివిఓ భాస్కర్,అంబుడ్స్‌మెన్ చంద్రశేఖర్,ఎస్ఆర్‌పి మల్లి కార్జున,ఎంపిడిఓ మణిమంజరి,ఈఓఆర్‌డి ప్రభావతి,పిఆర్ఏఈ నరసింహులు,ఏపిఓ తిమ్మారెడ్డి,ఈసి శ్రీనివాసులు ఆయా గ్రామాల ఎఫ్ఏలు,టిఏలు తదితరులు పాల్గొన్నారు.

## 2024లో తెదేపా గెలుపును ఎవ్వరూ ఆపలేరు..!

:- టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం సయ్యద్



**కర్నూలు రూరల్,డిసెంబరు 14,ప్రభాతవార్త :** 2024ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం సయ్యద్ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఈ తాండ్రపాడు గ్రామం 45వ బూత్ నందు ఇంటింటికి తిరుగుతూ తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా అధికారంలోకి వస్తే నిరు ద్యోగ బృతి కింద నెలకు రూ.3వేలు,ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పేరు తో ఒక్కో పిల్లాడికి రూ.15వేలు,ఆడబిడ్డ నిధి కింద 18సం॥లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం,ప్రతి ఇంటికి రక్షిత మంచినీటి కొళాయి సౌకర్యం కల్పిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకు రూ.20వేలు చెల్లిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కావున ప్రజలు ఈ ఎన్నికల్లో బాగా ఆలోచించి చంద్రబాబుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 45వ బూత్ ఇంచార్జ్ ఎన్ శ్రీరాములు,టి వెంకన్న తదితరులున్నారు.

## సంక్షేమ పథకాల ద్వారానే పేదప్రజలకు ఆర్థిక సహాయం : కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



**కర్నూలు రూరల్,డిసెంబరు 14,ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల ద్వారానే పేదప్రజలకు ఆర్థిక సహాయం అందుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని ఉల్చాల గ్రామ సచివాలయం నందు మా నమ్మకం నువ్వే జగనన్న,ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధాకర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే సుధాకర్‌కు కర్నూలు మండల ఎంపిపి డి వెంకటేశ్వ మ్మ,మాజీ మండల ఉపాధ్యక్షుడు డి వాసు,గ్రామ వైసిపి నాయకులు,సచివాలయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో రాష్ట్రంలోని ప్రజలకు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలలో భాగమైనటువంటి నవరత్నాల ద్వారా ఉల్చాల గ్రామానికి ప్రత్యక్ష మరియు పరోక్ష నగదు బదిలీ ద్వారా మొత్తం రూ.20,31,66,200 లు లబ్ది జరిగిందన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో మనందరి కళ్లెదుటనే ఇంత మొత్తంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా కుల,మత ప్రాంత వర్గ పార్టీ తేడా లేకుండ అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కావున మరల మన ఆంధ్రప్రదేశ్‌కి జగనే మళ్లీ సిఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోకారి,షేక్ కలాం,వార్డు మెంబర్ ముల్లకల్,రాముడు,సురేష్,స్థానిక వైసిపి కార్యకర్తలు,అభిమానులు, సచివాలయ సిబ్బంది,వాలంటరీలు పాల్గొన్నారు.

## మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించిన వైసిపి కౌన్సిలర్

**ఆదోని రూరల్,డిసెంబరు 14,ప్రభాతవార్త :** పట్టణంలోని 18వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించాడని అలాగే ప్రజల కోసం అప్పటి ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లను కూల్చి ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్నా మున్సిపల్ కమీషనర్ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ ఆరోపించారు. గురువారం ఆమె మాట్లాడుతూ 18వ వార్డు కౌన్సిలర్ చిన్న ఏకంగా మున్సిపాలిటీ మరుగుదొడ్లను పడగొట్టి ఆయన సొంత ఇంటిని నిర్మించుకుంటున్నాడని ఒక ప్రజా ప్రతినిధి అయ్యుండి ఇలా చేయడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ నిధులను నష్టం చేస్తున్నారని మున్సిపల్ కమీషనర్,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌లకు 20రోజుల నుండి తెలిసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులు ఏమి చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలని కబ్జాకు గురైన స్థలాన్ని వెంటనే కూల్చివేయాలని లేనిపక్షంలో ఆ స్థలానికి సంబంధించిన కొన్ని ఆధారాలు జిల్లా కలెక్టర్,రీజనల్ డైరెక్టర్ అనంతపురం వారికి త్వరలో కలిసి అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు రామకృష్ణ,మండల మాజీ ఎంపిపి మురళీ,సయ్యద్,వసీం ఖాద్రీ,గోపాల్,మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కొండాపురం శ్రీనివాసులు,నరసప్ప,భరత్, వీరేష్,బోయ వీరన్న,రమేష్,లింగయ్య,రాఘవేంద్ర రెడ్డి,బాబురావు,లక్ష్మిరెడ్డి,నాగేంద్ర తదితరులున్నారు.

## కీళ్లమార్పిడి అపరేషన్ విజయవంతం సేవా ట్రస్టుద్వారా సెవెన్‌హిల్స్

**నంద్యాల,డిశంబరు 14విద్య ప్రభాతవార్త :** నంద్యాల పట్టణంలో సెవెన్‌హిల్స్ మల్టీస్పెషల్ హస్పటల్ మోకాళ్ల కీళ్ల మార్పిడి అపరేషన్ విజయవంతము అయిందని డైరెక్టరు మారుతీకుమారు చెప్పారు. గురవారము అయిన విలేకర్లతో మాట్లాడుతూ కీళ్ల మార్పిడి అపరేషన్ విజయవంతము చేసిన అర్థోపిడిక్ వైద్యులు డాక్టరు కెక్రాంతి కిరణ్‌శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం గోనేపల్లి గ్రామానికి చెందిని క్రిష్ణారెడ్డి సుమారు 8సంవత్సరాల క్రితము తిరుపతి పట్టణము నందు రెండు మోకాలకి కీళ్ల మార్పిడి అపరేషన్ చేయించుకున్నాడు కాని అనుకోని విదముగా టూవీలర్ నుండి కింద పడి తనకుడి కాలికి గాయం కారణంగా విపసరీతమైన ఇన్ఫెక్షన్ అవటము వలన ఇన్ ప్లాంట్ తొలగించడము జరిగింది, దీనితో కేవలము రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితము అయ్యాడని చెప్పారు. అప్పటి నుండి రివిజన్ అపరేషన్ కొరకు హైదరాబాదు తిరుపతి చెన్నై వంటి పట్టణాలల్లో కన్సలేషన్ కొరకు సంప్రదించగా రివిజన్ మోకాల్ల మార్పిడి శస్త్ర చికిత్సకు రూ 10లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలియజేశారు దీనితో అర్థికంగా భరించే శక్తి లేక ఉన్నాడు. అదే పట్టణానికి చెందిన వైస్సార్సిపి పుట్టపర్తి సమన్వయకర్త కొత్తకోట సోమశేఖరరెడ్డి కృష్ణారెడ్డిని పరామర్శించి నంద్యాల జిల్లాలో సెవెన్ హీల్స్ మల్టీ స్పెషాల్టీ హస్పటల్ నందు కేవలము ఇంప్లాంట్ ఖర్చు పెట్టుకోగలిగితే అపరేషన మందులు అన్నీ ఉచితంగా చేస్తారని కృష్ణారెడ్డికి తెలియజేయడముతో తాను వెంటనే సెవెన్‌హిల్స్ హస్పసటల్‌ను సంద్రించాని చెప్పారు. కాత్యయిని సేవా ట్రస్టు అద్వర్యంలో వీరికి కేవలము 3లక్షల ఇంప్లాంట్ ఖర్చుతో అపరేషన్ విజయవంతము చేశామని కుమారు చెప్పారు. కాతాయిన సేవా ట్రస్టు ఇదివరకే సుమారు రూ 15కిపై మోకాల్ల అపరేషన్ ఉచితంగా చేయడము జరిగిందని చెప్పారు. ఈ మోకాళ్ల అపరేషన్‌కు సహకరించిన జనరల్ మోడిషన్ వైద్యులు డాక్టరు శ్రీకాంత్‌రెడ్డి మరియు డాక్టరు మదుసూదనరెడ్డివైద్య బృందానికి అబినందులు చెప్పారు.

## స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్



**కర్నూలు అర్బన్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేయుచున్న స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్‌ను సందర్శించిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా.రామగిడ్డయ్య అక్కడ జరుగుతున్న పనులను మరియు అక్కడ ఏర్పాటు చేయాల్సిన పరికరాల చిన్నపిల్లల హెచ్ఓడి డా.విజయానంద్‌బాబుతో చర్చించారు. అనంతరం ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఫిమేల్ నందు జరుగుతున్న ఎంపిహెచ్‌డబ్ల్యుఎఫ్ వార్షిక పరీక్షల తీరును తనిఖీ చేశారు. ఈపరీక్షలకు 135 మంది విద్యార్థులు హాజరయ్యారని వీరికి రేపటి నుండి జరగబోయే ప్రాక్టీకల్ పరీక్షలకు అవసరమయ్యే అవసరాలను మరియు ఇతర వసతులను ఏవి తక్కువ కాకుండా చూసుకోవాలని సిబ్బందికి అదేశించారు.

## కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేసిన పోలీసులు



**మంత్రాలయం,డిసెంబర్ 14,ప్రభాతవార్త:** మండలంలోని మాధవరం,మంత్రాయలం పోలీస్ స్టేషన్‌లలో పోలీసులు పట్టుకున్న కర్ణాటక మద్యాన్ని డిఎస్‌పిసీతారామయ్య ఆధ్వర్యంలో మాధవరం చెక్‌పోస్ట్ వద్ద ధ్వంసం చేశారు.మాధవరం స్టేషన్‌లో 18 బాక్సుల మద్యం,మంత్రాలయం స్టేషన్‌లో 8 బాక్సుల మద్యం మొత్తం 26 బాక్సుల మద్యం సుమారు 2496 టెట్రా పాకెట్లు,225 లీటర్ల మద్యాన్ని రోడ్డుపై ఉంచి ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు.మండలంలో ఎవరినా కర్ణాటక మద్యం తరలించినా,విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వీరివెంట సిఐ శ్రీనివా సులు,మాధవరం,మంత్రాలయం ఎస్ఐలు కిరణ్‌బాబు, వేణుగోపాల్‌రాజు తదితరులు ఉన్నారు.

## జగనన్న పాలనలో ప్రతిఒక్కరికి న్యాయం



**దేవనకొండ,డిసెంబరు 14,ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికి న్యాయం జరిగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు, యువనేత గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బండగట్టు గ్రామంలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తమవంతుగా కృషి చేశామని పేర్కొన్నారు. అలాగే సిఎం జగన్ విద్య,వైద్య,వ్యవసాయ రంగానికి పెద్ద పీఠ వేశారన్నారు. బండగట్టు గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇస్తామని గ్రామస్తులకు తెలిపారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కిట్టు,వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, ఎంపిపి భర్త లుముంబా,నెల్లిబండ సర్పంచ్ భర్త వెంకటేష్, తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్,నాయకులు ప్రతాప్,గోపాల్,బజారి,రాఘవేంద్ర, మల్లి,సుధాకర్‌రెడ్డి,శ్రీరాములు, రామాంజనేయులు, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో సంక్షేమం,అభివృద్ధికి పెద్దపీట



**బనగానపల్లె,డిసెంబర్14,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో గల కొండపేటలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా కొండపేట వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కాలనీలో గల సమస్యలను ప్రజలతో మాట్లాడి స్వయంగా తెలుసుకుంటూ కార్యక్రమాన్ని సాగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ,వాలంటీర వ్యవస్థను తీసుకువచ్చారని ఆయన తెలిపారు.జగనన్న ప్రభుత్వంలో ప్రజల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు.అర్హత ఉన్న ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని,ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి సీసీ రోడ్లు,జలజీవన్ కింద ఇంటింటికి తాగునీరు,జగనన్న కాలనీలు,సచివాలయ భవనాలు,ఆసుపత్రుల అభివృద్ధి, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి దేశంలోనే ఆదర్శవం తమైన పాలన అందిస్తున్నరన్నారు.నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో మార్పు వచ్చిందని ప్రజలంతా సంతోషంగా ఉంటున్నరన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలన్నా,రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని,ఎమ్మెల్యేగా తనను గెలిపిం చాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజల పై ఉందని ఆయన అన్నారు.నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్,మండల అభివృద్ధి అధికారి ఏ.శివరామయ్య,మండల జెడ్పీటీసీ సుబ్బలక్ష్మమ్మ,బనగానపల్లె వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ దీవెనమ్మ,బనగానపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ ,భానుముక్కల పరపతి సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు,గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఖలీల్,పంచాయతీరా జ్ ఏఈ మహేష్, గ్రామీణ నీటిపారుదలశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సాయి కృష్ణ, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు,మండల విద్యాశాఖ అధికారి స్వరూప రాణి,వైసీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్,అబ్దుల్ ఫైజ్,నూకల వెంకటసుబ్బయ్య, ఎంపిటిసి తాహీద్,సూరా కిషోర్,చక్రవర్తి టాకీస్ సాధక్,సునార్,ఎగ్బల్ హుస్సేన్,ఫ్రూట్ మర్చంట్ ఖలీల్,కూరగాయల రహిమాన్,సైకిల్ షాప్ మహబూబ్ వలి,సజ్జాత్ హుస్సేన్,లాయర్ సాజిద్ హుస్సేన్,జి.టి. వెంకట్రామిరెడ్డి,గౌండా వలి,ఆటోనగర్ సయ్యద్,తెలు గుపేట మద్దయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# కరువు పీడిత ప్రాంతాల్లో కేంద్ర బృందము పర్యటన



**నంద్యాల,డిశంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాలను కేంద్ర కరువు బృందము పర్యటించి నేరుగా దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు.అంతకు ముందు నంద్యాలలోని అర్అండ్‌బి అతిది గృహములో కేంద్ర కరువు బృందాన్ని జేసి రాహుల్‌కుమారరెడ్డి కలిశారు అనంతరము కరువు బృందము డోన్ నియోజక వర్గంలోని యస్‌రంగాపురము గ్రామంలో దెబ్బతిన్న కంది,జొన్న మొక్కజొన్న అముదము తదితర పంటలను నేరుగా వెల్లి పరిశీలించారు అనంతరము పోటో ఎగ్జిబిషన్ తిలకించారు. ముఖ్యంగా నంద్యాల జిల్లాలో బేతంచెర్ల పగిద్యాల, మిడుతూరు మండలాల కరువు రైతులతో ముఖాముఖి మాట్లాడి వారిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకరవు బృాందమలో సభ్యులు నీతి అయోగ్ సీనియర రీసర్చ్ అఫీసరు డాక్టరు అనురాద, జలశక్తి మంత్రిత్వం శాఖ తాగునీరు పారిశుద్యవిబాగం అసిస్టెంట్ అడ్వైజరు సంతోస్, డిపార్టుమెంటు అప్పుడ అండ్ పబ్లిక్ డిస్టిబ్యూషన్ అండర్ సెక్రెటరీ సంగీత్‌కుమారు ఉన్నారు.అలాగే కార్యక్రమంలో జిల్లా రెవెన్యు అదికారి పుల్లయ్య, ఎంపిపి బుగ్గన నాగభూషణమురెడ్డి డ్వామ పిడి రామచంద్రారెడ్డి, జిల్లా జేసిఎ మోహన్‌రావు, హార్టికల్చరు అదికారి నాగరాజు, వివిద శాఖల అదికారులు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన గోకుల్‌రెడ్డి



**నంద్యాల,డిశంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి :** రాష్ట్ర విద్యుత్,అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామంద్రారెడ్డిని పాణ్యం నియోజక వర్గం వైసిపి పార్టి పరిశీలకు గోకుల క్రిష్ణారెడ్డి తిరుపతిలో కలిశారు. నంద్యాల మండలంలో భీమవరము గ్రామానికి చెందిన నంద్యాల జేట్‌పిటిసి సభ్యులు,పాణ్యం నియోజక వర్గ సమన్వయ కర్త పరిశీలకుఅయిన గోకుల క్రిష్ణారెడ్డి గురువారము ఉదయం తిరుపతి వెల్లి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకముగా కలిశారు.నంద్యాల మండల అబివృద్ధిపై చర్చించారు.

## పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ




**నందా ్యల క్రైం, డిసెంబరు 14, ప్రభాతవార్త:** పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఏఎస్ఐ చంద్రగిరి గంగన్న అనారోగ్యం కారణంగా చనిపోయారు. ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సహాయంగా ప్రభుత్వం నుండి విడోఫండ్ రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేలు కలిపి మొత్తం రూ.75 వేల చెక్కును ఏఎస్ఐ సతీమణి లక్ష్మీనారాయణమ్మకు చెక్కును అందజేశారు. ముందుగా పిల్లల యొక్క యోగసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సంక్షేమానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఏఓ నిజాముద్దీన్, ఆర్ఎస్ఐ వీరన్నలు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతం చేయండి - జేసీ ఎన్.మౌర్య




**కర్నూలు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఎపిఎస్పీడీసీఎల్ అధికారులను అదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ల ను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ 14 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎపిఎస్పిడీసీఎల్ అధికారులను ఆదేశించారు. నేటి సత్ సంకల్పం రేపటి వెలుగుకు సహకారం అవుతుందన్నారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందని అందుకు గాను ఇంధన పరిరక్షణ కొరకు ఎల్ఈడి బల్బ్ ల వాడకం గురించి, కరెంట్ ఇస్త్రి పెట్టెల వాడకం, ఎక్కువ స్టార్ లు వున గృహోపకరల వాడకం తదితర వాటి గురించి ప్రజలకు తెలియచేసి విద్యుత్ ను పొదుపుగా వాడే విధంగా ప్రజలకు ఈ వారోత్సవాల్లో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. కార్యక్రమంలో ఏపీఎస్పిడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, ఈఈ లు ఓబులేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..

## అంగన్‌వాడీలు రిటైండ్‌మెంటు బేనిఫిట్ రూ 5లక్షలు ఇవ్వండి



**నంద్యాల, డిశంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి**

రాష్ట్ర వ్యాపత్తంగా తమ సమస్యల సాదన కోసం అగన్‌వాడీలు మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నారు. అందులో బాగంగా గురువారము పాణ్యంలో చేస్తున్న అంగన్‌వాడీ దీక్షా శిబిరములోకి మాజీ యంయల్ఏ గౌరు చరితా పాల్గొన్నారు. ఈసందర్భముగా అమె మాట్లాడుతూ వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని డిమాండు చేశారు ముఖ్యంగా వారికి రిటైండ్‌మెంటు బెనిఫిట్స్ కింద రూ 5లక్షలు చెల్లించాలని అమె కోరారు. అలాగే ప్రభుత్వం విడుదల చేసిన జివో నెంబరు ఒకటిని వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు.అలాగే సంపూర్ణ పోషణ మోను చార్జిలను పెంచాలని డిమాండు చేశారు. అన్నింటికి మించి కనీస వేతము రూ 25వేలు ఇవ్వాలని కోరారు.

## అయ్యప్పస్వాముల ఇరుముడి పూజలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి



**వెల్దుర్తి,డిసెంబర్14,ప్రభాతవార్త :** అయ్యప్పస్వాముల ఇరుముడి పూజా కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు.స్థానిక జర్నలిస్టు కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సద్గురు సాయినాథ అయ్యప్పస్వామి ఆలయంలో శబరిమలకు తరలుతున్న అయ్యప్పస్వామి మాలాధారణ భక్తులు గురువారం ఇరుముడి పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే తనయుడు కంగాటి రాంమోహన్‌రెడ్డితో పాటు మరికొందరు అయ్యప్ప మాలాధారణ భక్తులు శబరిమలకు బయలుదేరారు.ముందుగా వారు అయ్యప్పస్వామికి పూజలు చేశారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.మాలాధారణ భక్తులను ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు,మిత్రులు,శ్రేయోభిలాషులు కలిసి క్షేమంగా వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి సురక్షితంగా స్వస్థలానికి చేరుకోవాలని అయ్యప్పస్వామిని వేడుకున్నారు.ఎమ్మెల్యే తనయుడు ఆలయ నిర్వాహకులకు కొంత నగదును విరాళంగా అందించారు.ఆలయంలో భక్తులందరికి అల్పాహారం,స్వాములకు పాలు,పండ్లు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కంగాటి వాసంతమ్మ,బూర్గల సర్పంచ్ భువనేశ్వరమ్మ,క్రిష్ణగిరి ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి,కంగాటి శివారెడ్డి,సొసైటీ అధ్యక్షులు కంగాటి వంశీధర్‌రెడ్డి,గురుస్వాములు,ఆలయకమిటీ అధ్యక్షులు బొమ్మన నాగసుదర్శన్‌రెడ్డి,కమిటీ సభ్యులు గోపినాథ్‌నాయుడు,చిరంజీవి,మధు తదితరులు పాల్గొన్నారు.